అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం మంచి నిర్ణయం

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్

దుండిగల్: దుండిగల్‌లోని చిన్న దామెర చెరువులో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం మంచి నిర్ణయమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్ అన్నారు. చెరువు కబ్జాకు గురవుతుందని స్థానిక సీపీఐ నాయకుడు నాగేష్ 2010లోనే కోర్టును ఆశ్రయిస్తే అతన్ని బెదిరించి కుటుంబాన్ని భయభ్రాంత్రులకు గురి చేశారన్నారు. నియోజకవర్గంలో కబ్జాకు గురైన జగద్గిరి గుట్ట, గాజులరామారం పరిధిలో విస్తరించి ఉన్న పరికి చెరువు, గాజులరామారం చింతల్ చెరువు, బంధం చెరువు, చర్చ్ గాగిలాపూర్‌లోని లక్కకుంట కసారం చెరువు, సుభాష్‌నగర్ ఫాక్స్‌సాగర్, నాలా, సురారం లింగం చెరువు, పెద్ద చెరువు, కొత్త కుంట, ఎన్నా చెరువు, కట్టు కాలువ, వడ్డే వాని కుంట, మైబు చెరువు, చిన్న బంధం చెరువు, అంబీర్ చెరువు తదితర అనేక చెరువుల్లో నెలకొన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేసి కాపాడాలని కోరారు. చెరువులను పరిరక్షించని నేపథ్యంలో సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు బాధ్యతయూతంగా వ్యవహరించాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘం ప్రతినిధులు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన రాజు మాట్లాడుతూ స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలపై స్పందిస్తూ వాటికి పరిష్కారం చూపాలని సూచించారు.

ఉమామహేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు



నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న బీజేపీ నేత ఈటల రాజేందర్, ఆలయ ధర్మకర్త మదన్‌గౌడ్

సుభాష్‌నగర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సూరారంలోని ఉమామహేశ్వర ఆలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జాగరణ చేసే భక్తుల కోసం ఆలయ ధర్మకర్త మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో భరతనాట్యం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉపవాస దీక్ష విమరణ చేసిన వారికి అన్నదానం చేయగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత ఈటల రాజేందర్, దామోదర్, కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కీసరగుట్టలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమానికి హాజరైన పుప్పాల భాస్కర్

కుత్బుల్లాపూర్: మున్నూరు కాపు కులస్తులు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మున్నూరు కాపు సంఘం యూత్ కన్వీనర్ పుప్పాల భాస్కర్ అన్నారు. శివరాత్రి ఉపవాస విరమణ దీక్ష సందర్భంగా శనివారం కీసరలోని శ్రీరామలింగేశ్వర మున్నూరు కాపు సంఘం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కీసర కమిటీ మామిళ్ల శ్రీనివాస్, చిన్న మహేందర్, దేవరజ్ , మురారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికే పార్టీలో గుర్తింపు



పోలీస్ శివపాటిల్‌కు నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు

సుభాష్‌నగర్: పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి తప్పక గుర్తింపు లభిస్తుందని సుభాష్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు అన్నారు. శనివారం భవానినగర్‌లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పోలీస్ శివపాటిల్‌ను కార్యదర్శిగా ఎన్నుకుని నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ గిరిజన మోర్చా అసెంబ్లీ కన్వీనర్ అంగడి మల్లేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి శంపూర్ విజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పోల్కం విగ్నేష్‌ముదిరాజు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి బ్రిడ్జి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల కృతజ్ఞతాభినందన సభ

పంజగుట్ట: ప్రభుత్వ డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో చేర్చి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతాభినందన సభ రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ సి.హెచ్.కిషోర్ కుమార్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ ఆదివారం (నేడు) ఖైరతాబాద్ లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆయన మాట్లాడుతూ... సమావేశానికి రాష్ట్రంలోని 132 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలల్లో పనిచేస్తున్న 1940 మంది గెస్ట్ లెక్చరర్స్ హాజరౌతారని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌లు పాల్గొంటారని తెలిపారు.

ఫుడ్ ఫెస్ట్.. వంటకాలు వెరీ టేస్ట్



వంటకాల రుచులు చూస్తున్న ఆహార ప్రియులు



బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఫుడ్‌ఫెస్టివల్‌ను ప్రారంభించిన ట్రిస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి

రంగారెడ్డినగర్: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తే ఎన్నో అద్భుతాలను సృష్టిస్తారని మేడ్చల్ జిల్లా ట్రిస్మా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ రంగారెడ్డినగర్‌లోని బ్రైట్ కాన్సెప్ట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 'ఫుడ్ ఫెస్ట్ 2024'శనివారం ఆయన జిల్లా ట్రిస్మా ఉపాధ్యక్షుడు బిర్రు ఆంజనేయులు, పాఠశాల కరస్పాండెంట్ వినోద్ కుమార్‌జాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ ఫెస్ట్‌లో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల వంటకాలు ఆహార ప్రియులను ఆకట్టుకున్నాయి. పావ్‌బాజీ, కట్‌లెట్, ఆవడ, డబుల్‌కా మీటా తదితర వంటకాలతో విద్యార్థులు అబ్బురపరిచారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలన్నారు. అప్పుడే వారు ఉన్నతులుగా ఎదుగుతారన్నారు. పాఠశాలల కరస్పాండెంట్లు కోల వెంకటేష్‌ముదిరాజ్, సీహెచ్.నర్సింహులుగౌడ్, పోరంకి శ్యాంప్రసాద్‌రాజు, మధు,పాఠశాల ఇన్‌చార్జి ఆయేషా, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నటి సంయుక్త సందడి

రియల్‌మీ 12.5జీ మొబైల్ లాంచ్



కుత్బుల్లాపూర్: తెలంగాణాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న హ్యాపీ మల్టీ బ్రాండ్ మొబైల్ స్టోర్ ద్వారా రియల్‌మీ 12.5 జీ ఫోన్ సీరిస్‌ను విడుల చేయడం ఆనందంగా ఉందని సినీనటి సంయుక్త మీనన్ అన్నారు. శనివారం సుచిత్ర సర్కిల్‌లోని మల్టీ బ్రాండ్ రిటైల్‌చైన్ హ్యాపీ మొబైల్స్ షోరూమ్‌లో సంస్థ సీఎండీ కృష్ణపవన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోట సంతోష్‌లతో కలిసి సంయుక్త మీనన్ రియల్‌మీ 12.5జీ సిరీస్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రపంచంలో మనం ఎక్కడ ఉన్నా మొబైల్ వ్యవస్థ మానవ సంబంధాలను చేరువలో ఉంచుతోందన్నారు. హ్యాపీ మొబైల్స్ షోరూమ్‌లో వినియోగదారులకు అభిరుచులకు అనుగుణంగా పలు బ్రాండ్‌ల మొబైల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు శరణ్ శ్రీహర్ష, సేల్స్ డైరెక్టర్ తరిని ప్రసాద్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంథాలో కబ్జా.!



గాజులరామారం సర్వే నం.13లో వెలిసిన పశువుల షెడ్డు

గాజులరామారం సర్వే నంబర్ 13లో గత పన్నెండు రోజులుగా కబ్జా క్రీడా కొనసాగుతోంది. రెవెన్యూ వర్సెస్ కబ్జారాయుళ్ల మధ్య జరుగుతున్న ఈ పోటీలో రెవెన్యూ అధికారులు ఎన్ని ఎత్తులు వేసినా కబ్జారాయులు మాత్రం వాటిని చిత్తు చేస్తూ పైచేయి మాదే అంటూ సవాల్ విసురుతున్నారు. సర్వే నంబర్ 13 ప్రభుత్వ స్థలాని కొంత మంది ఓ పార్టీకి చెందిన నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న విషయాన్ని 'సాక్షి'ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు సైతం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ వస్తున్నారు. కానీ కబ్జారాయుళ్లు మాత్రం వెనుకడుగు వేసేది లేదంటూ, సదరు స్థలాన్ని కాజేసి తీరుతామని భీష్మించి కూర్చున్నారు.

సుభాష్‌నగర్: ఈ నెల 6న 'ప్రభుత్వ స్థలం కబ్జా'అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో తహసీల్దార్ రెహమాన్ స్పందించారు. ఆదేశాలు జారీ చేయడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్ అదేరోజు సదరు స్థలం ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. బోర్డు ఏర్పాటు చేసిన నాలుగు గంటల వ్యవధిలోనే కబ్జారాయుళ్లు తొలగించారు. ఈ విషయమై నలుగురిపై కేసులు నమోదు చేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తహసీల్దార్‌కు రిపోర్ట్ చేశారు. తాజాగా శుక్రవారం రాత్రి ఓ చిన్న పాటి షెడ్డు వేసి కొన్ని ఆవులను తీసుకువచ్చి కొత్తకోణంలో కబ్జా చేసేందుకు తెరలేపారు. ఇక రెవెన్యూ అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ప్రభుత్వ స్థలంలోకి ఎవరెవరు వస్తున్నారో షిఫ్ట్ వైజ్‌గా నిఘా...

సర్వే నంబర్.13లోని ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న కబ్జాకు అక్కడున్న సూత్రధారులు పక్క ప్రణాళిక రూపొందించుకున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం , రాత్రి వేళలో ముగ్గురు చొప్పున వ్యక్తులను నియమించారు. సదరు స్థలం వద్దకు ఎవరు వస్తున్నారు.? ఏమి చేస్తున్నారో సంబంధిత వ్యక్తుల ఫొటోలు తీసి ఈ కబ్జా తతంగం నడుపుతున్న సూత్రధారులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారు.

'మాకు అడ్డొస్తే నీ అంతు చూస్తాం'

బాధితుడి ఫిర్యాదుతో డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లపై ఎస్టీ, ఎస్సీ అట్రాసిటి కేసు

నిజాంపేట్: ప్రైవేట్ స్థలాన్ని కబ్జా చేయడం పాటు స్థల యజమానిని కులం పేరుతో దూషించిన డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లపై బాచుపల్లి పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్‌కు చెందిన తులసి నర్సింహ కుటుంబ సభ్యులకు నిజాంపేట్ సర్వే నం. 191లో 60 గజాల చొప్పుల మూడు ప్లాట్లు కలిపి 180 గజాల స్థలం ఉంది. సదరు స్థలాలకు ప్రభుత్వం గతంలో పట్టాలు సైతం మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సదరు స్థలంలో నిర్మించిన గదులను, కాంపౌండ్ వాల్‌ను కొందరు వ్యక్తులు కూల్చివేసి ఇంటి నిర్మాణం చేపట్టారు.



నర్సింహకు చెందిన స్థలంలో కొనసాగుతున్న నిర్మాణ పనులు

మాట్లాడుదామని పిలిచి బెదిరింపులు..

◆ ఈ విషయం తెలుసుకున్న నర్సింహ గతేడాది డిసెంబరు నెలలో తమ ప్లాట్ల వద్దకు వెళ్లి నిర్మాణం చేపడుతున్న వ్యక్తులను అడుగగా నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, నిజాంపేట్ 8వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌రెడ్డిలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో బాధితుడు వారిని సంప్రదించగా డిసెంబరు 23వ తేదీన స్థానికంగా ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్దకు రావాలన్నారు. స్థల విషయం మాట్లాడేందుకు వారు చెప్పడంతో నర్సింహ వెళ్లాడు. దీంతో సురేష్‌రెడ్డి, ధన్‌రాజ్‌యాదవ్‌లు బాధితుడిపై బెదిరింపులకు దిగారు.

ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో..

◆ 'ఈ స్థలంలో పక్కాగా నిర్మాణం చేపడతాం.. పట్టా ఉంటే మాకేమిటి.. ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకోమంటూ.. మాకు అడ్డొస్తే నీ అంతు చూస్తాం'అంటూ బెదిరించి కూలం పేరుతో దూషించారు. దీంతో బాధితులు బాచుపల్లి తహసీల్దార్‌ను ఆశ్రయించగా సదరు స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. అయినా కబ్జాదారులు స్థలాన్ని తమ గుప్పిట్లో ఉంచుకోవడంతో నర్సింహ బాచుపల్లి పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కబ్జాదారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటితో పాటు 447, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

తల్లిని లోబర్చుకుని.. కూతురిపై లైంగికదాడి


నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు

జగద్గిరిగుట్ట: భర్తతో విడిపోయిన వివాహితను ఓ వ్యక్తి మాయమాటలతో లోబర్చుకున్నాడు. ఆపై వ్యభిచార కూపంలోకి దించాడు. అంతటితో ఆగకుండా వివాహిత కూతురిపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించాడు. చివరికి బాలిక సాహసం చేసి తల్లికి చెప్పడంతో అసలు విషయం బయటకు వచ్చింది. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

◆ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్, లక్ష్మి దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా 2016లో విడిపోయారు. అప్పటి నుంచి పిల్లలు తండ్రి వద్దనే ఉంటుండగా లక్ష్మి ఒక్కతే ఆల్విన్‌కాలనీ జలకన్య వద్ద ఉంటూ భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో చంద్రశేఖర్ అలియాస్ సిద్ధు ఆమెకు పరిచయమయ్యాడు. ఆమె ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న సిద్ధు ఆమెతో అక్రమ సంబంధం ఏర్పర్చుకుని ఆమెతో వ్యభిచారం చేయించసాగాడు. అప్పటి నుంచి పలువురి వద్దకు ఆమెను పంపుతూ డబ్బులు సంపాదిస్తు వచ్చిన వాటిలో ఆమెకు కొంత ఇచ్చేవాడు.

◆ దీనబంధుకాలనీలో 7వ తరగతి చదుతున్న ఆమె పెద్ద కుమార్తె(13) దసరా సెలవుల్లో తల్లి వద్దకు వచ్చి అక్కడే ఉంటుంది. కొన్నాళ్ల నుంచి బాలిక ముభావంగా ఉండటంతో పాటు తాను చనిపోతానని పలుసార్లు తల్లితో చెప్పి రోదించింది. విషయాన్ని ఆరా తీయగా తల్లి ఇంట్లో లేని సమయంలో సిద్ధు తనపై అనేక సార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని.. విషయం ఎవరికైనా చెప్తే అందరిని చంపేస్తానని బెదిరించాడని బాలిక తల్లికి చెప్పింది. దీంతో బాధితురాలి తల్లి జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సిద్ధుపై 376ఏబీ, 506, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా క్రియేటివ్ స్కూల్ వార్షికోత్సవం



చిన్నారుల నృత్య ప్రదర్శన

కుత్బుల్లాపూర్: షాపూర్ నగర్‌కు చెందిన పాఠశాల పదో వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. గాజులరామారం మహారాజా గార్డెన్‌లో జరిగిన వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ షబ్బీర్, ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం చదువు, ఆటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-1లోని హయత్‌ప్లేస్ హోటల్‌లో శనివారం ది గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్-2024ను నిర్వహించారు. గ్లోబల్ ట్రీ సంస్థ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయగా ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల ప్రతినిధులు ఇందులో పాల్గొని తమ సంస్థల్లో విద్యావకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ ఫెయిర్‌ను మాజీ మంత్రి మల్లారెడ్డి, సీబీఐటీ ప్రొఫెసర్ ఎస్ఎల్ఎస్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీ నర్సింహులు ప్రారంభించారు. గ్లోబల్ ట్రీ, మల్లారెడ్డి యూనివర్శిటీలు పరస్పర సహకారం అందిస్తున్నాయన్నారు.

గురుకుల అభ్యర్థుల కోసం న్యాయ పోరాటం

ఉస్మానియా యూనివర్సిటీ: గురుకుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల కోసం న్యాయ పోరాటం చేయనున్నట్లు ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఎల్చాల దత్తాత్రేయ శనివారం పేర్కొన్నారు. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ తదితర 9 వేల ఉద్యోగాలకు 1:2 మెరిట్ ప్రకారం ఎంపికైనట్లు తెలిపారు. అయితే ఇందులో కేవలం 5 వేల మందికి ఉద్యోగాల నియామక పత్రాలు అందజేశారని మిగిలిన 4 వేల ఉద్యోగాలను పక్కన పెట్టారని వివరించారు. మిగిలిన 4 వేల ఉద్యోగాలను కూడా మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కొందరు అభ్యర్థులకు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికయ్యారని వారు పెద్ద ఉద్యోగంలో చేరగా మిగతావి ఖాళీగా ఉంటున్నాయని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గురుకుల నియామకాల విధానంలో లోపాలు ఉన్నందున ఉద్యోగాలకు ఎంపికైన నాలుగు వేల మందికి అన్యాయం జరుగుతుందని ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని కోరారు. గురుకుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు న్యాయం జరిగేందుకు కోర్టును ఆశ్రయించనున్నట్లు దత్తాత్రేయ పేర్కొన్నారు.

దేశం అభివృద్ధి పథంలో నడవాలంటే

బీజేపీతోనే సాధ్యం

- మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్
- అశోక ఏలా మైనస్ కమ్యూనిటీ వాసులతో ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి బీజేపీఈటల రాజేందర్

సుబాష్‌నగర్: వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకు తావు లేకుండా దేశాభివృద్ధికి పాటు పడుతున్న మహోన్నత వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ అని మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం దూలపల్లిలోని అశోక ఏలా మైనస్ కమ్యూనిటీ వాసులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మూడోసారి దేశ ప్రజలు నరేంద్రమోదీని ప్రధానిగా చూడాలనుకుంటున్నారని అన్నారు. మోదీ హయాలో భారతదేశం నాల్గో ఆర్థిక శక్తిగా అవతరించిందన్నారు. ఐదు దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ హయాంలో కుంభకోణాల్లో కూరకుపోయిందని విమర్శించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ఇండియా కూటమి పేరుతో అతుకులు బొతుకులు లేని పార్టీలో కాంగ్రెస్ జత కట్టిందన్నారు.

◆ ఒకే దేశం, ఒకే చట్టాన్ని అమలు పరచడంతో పాటు ఎన్నో ఏళ్లుగా కొనసాగిన కశ్మీర్ సమస్యను ఆర్టికల్ 370ను రద్దు చేసి పరిష్కరించిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. దేశం అభివృద్ధి పథంలో నడవాలంటే బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ప్రతిపక్షాలను నమ్ముకుంటే దేశం అధోగతి పాలు కావడం ఖాయమన్నారు. నేడు ప్రపంచంలోనే భారతదేశం సైనికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతమైందన్నారు. దీని వెనుక ప్రధాని నరేంద్ర మోదీ కృషి ఎంతో ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిపిస్తే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరిన్ని నిధులు తెచ్చేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు రాజిరెడ్డి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సొంత గూడు సాకారమయ్యేనా..?

- సీఎం ప్రకటనతో ఇళ్ల దరఖాస్తుదారుల్లో ఆశలు
- మేడ్చల్ జిల్లాకు 17,500 ఇందిరమ్మ ఇళ్లు
- ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు 1.10 లక్షలు



ఏళ్లుగా ఎదురుచూపులు..

జీవిత కాలంలో సొంతగా ఇంటిని నిర్మించుకోగలమా అన్న ఆశతో జిల్లాలో వేలాది మంది నిరుపేదలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలో ఇంటి నిర్మాణం కోసం చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పేరుతో నిర్మాణాలు చేపట్టినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో నిరు పేదల కలలు సాకారం కానున్నాయి.

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగింటిని ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసింది. మిగతా రెండు గ్యారెంటీల్లో ఒకటైనా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 11న ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సంబంధిత అధికారులను ఆదేశించిన నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయనుండటంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు 17,500 ఇందిరమ్మ ఇళ్లు రానుండటంతో దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారెంటీలకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించేందుకు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్లు, 13 పురపాలక సంఘాలు, 61 గ్రామ పంచాయతీల్లో 8 రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలపై అర్హులైన ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున 7.09 లక్షల దరఖాస్తులు రాగా, అందులో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి 1,10,226 మంది దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించి ఇళ్ల నిర్మాణం కోసం మంజూరు పత్రాలు అందిస్తారు. సొంత స్థలం ఉన్నవాళ్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నచ్చిన రీతిలో నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.